

# అసలు రహస్యం

పట్టణ మహిళా సంఘ సమావేశానంతర బాతాఖానీ ప్రారంభమైంది.

అన్నపూర్ణమ్మగారొచ్చి "ఏమిటోయ్ ఉత్పలా! అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?" అంది.

"అటు చూడండి, మన పనిమనిషి పార్వతి! దాని వెనకాలే దాని మొగుడు! అదేం మంత్రం వేసిందో గాని, ఎప్పుడూ అలా దాని వెనకాలే తిరుగుతూ ఉంటాడు. నేనూ ఉన్నాను, నెలకోసారి కనిపించే మొగుడ్తో కాపరం చేస్తూ" అంది ఉత్పల.

"సరేలే! రోలెళ్ళి మద్దెలతో చెప్పిందిట, ఆవిడతోనే చెప్పావ్! పాపం బాబాయిగారు పిన్నిగారి మొఖం చూసి ఎన్నాళ్ళయిందో? ఎంత సేపూ అటాఫీసూ, ఇటు క్లబ్బూ - జలజ ఝాడింపు.

"అబ్బో పెద్ద నీ సంగతేమిటోయ్! ఫుల్ బాటిల్ వాటేస్కుని డబుల్ కాట్ కంటిల్లాయేగా మీవారు?" - అనుపమ అంటింపు

"సరిసరి! నీ సంగతే చెప్పావ్! పాపం మీ డైరెక్టర్ గార్కి యింటి మీద ఎంత మోజో, ఎప్పుడూ ఔట్‌డోర్లే!" - గిరిజ గూటింపు.

"చాల్లేండోయ్ మీ గోల! అర్థం లేకుండాను. అందరం ఒకే రైల్లో ప్రయాణం చేస్తున్నాంగానీ, ఉత్పల చెప్పినట్టు పార్వతికి తెలిసినపాటి ట్రిక్కు మనకి తెలియలేదు. ఎన్ని సంఘాలు పెడితేనేం, ఎన్ని ఉపన్యాసాలు దంచితేనేం, మొగుణ్ణి కొంగుకి కట్టుకోవడం తెలీకపోయిన తరువాత" - వాణిదేవి వాత.

"కరెక్టోయ్ వాణీ! సమ్ ట్రిక్ యీజ్ దేర్ విత్ హర్! ఐ విష్ ఐనో యిట్" గజలక్ష్మి జగాలోచన.

"ఓహోహో, ఆ ఆలోచనల్లో ఉన్నావా గజలక్ష్మి తల్లీ! ఆ మోటు బండ ఏదో మకర బంధం చెపుతుంది. ఆ బంధం వేసి మీ ఆయన్ని నువు పట్టుకునేటప్పటికి ఈ భూమికీ, నీకూ బంధం తీరిపోతుంది" - కామాక్షి కామెంటరీ.

"అలా కాదోయ్ కామాక్షీ! ఇన్నాళ్ళ నుంచి చూస్తున్నాం కదా! అలా ఇరవై నాలుగ్గంటలూ దాని కొంగు విడవకుండా తిరుగుతున్నాడంటే వాడు, దాని దగ్గర తప్పకుండా ఏదో రహస్యం ఉందోయ్! అదేమిటో లాగాలి అందరం కలసి", అంది మీనాక్షి



"ఇదిగో మీనా! తీరా దాని దగ్గరకి వెళ్ళి ఆ రహస్యం ఏమిటో కాస్త చెప్పు తల్లీ అని అడిగామా, అది కాస్తా సత్యభామ దగ్గర ద్రౌపది ఫోజు పెట్టి పాతివ్రత్య సూత్రాలు బోధించేయగలదు మనకి జాగ్రత్త!" రంగనాయకి.

రెడ్ సిగ్నల్.

"ఏమైనా సరే" అని చివరికి అంతా కలిసి పార్వతిని పిలిచి, ఆప్యాయంగా కాఫీ అందిచ్చి, "ఒసే పార్వతీ! నీ మొగుణ్ణి అలా నీ వెంకట యిరవైనాలుగ్గంటలూ తిప్పుకుంటావ్ గదా! నువ్వంటే వాడంత 'లవ్'తో పడిచావడానికి గల ఆ రహస్యం ఏమిటో మాకివ్వాళ చెప్పితీరాలి. చెప్పక పోయావో నీ తల వెయ్యి తమలపాకులు అవుతుంది, కాదు కాదు – వెయ్యివక్కలవుతుంది. అంతేకాదు, సంఘంలో ఉద్యోగానికీ నీకూ రాం రాం. జాగ్రత్త" అంటూ దబాయింపుగా అడిగేశారు.

"వాలమ్మో! అదేటమ్మో! అలాగంటారు? ఇరవై నాలుగ్గంటలూ పెళ్ళాం ఎనకాతలే తిరిగే మొగుడి సంగతి మీకు తెల్సినట్టు లేదు తల్లీ! లవ్వూ కాదు, ఆడి పిండవూ కాదు అనుమానప్పిశాచి నంజికొడుక్కి.

కాలు మడుసుకుంటాన్రా మగడా అంటే ఎనకాలే తయారవుతాడు. సచ్చే సావుగా వుంది యీడితో. ఆడాళ్ళ సమాజం గదాని ఇక్కడే దూరంగా ఉంటాడు...."

ఆపైన మహిళా సంఘానికి కళ్ళే తప్ప చెవులు పన్జేయడం మానేశాయి.